ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 జనగామ
ఆదివారం 22 సెప్టెంబరు 2024



బొడ్డెమ్మ బొడ్డెమ్మా.. కోల్..

ఉమ్మడి జిల్లాలో బొడ్డెమ్మ వేడుకలకు సిద్ధమైన ఆడబిడ్డలు

సండే స్పెషల్ SUNDAY SPECIAL

- రేపటి నుంచి సాగనున్న సంబురం
- తొమ్మిది రోజుల పాటు సందడే సందడి
- ఆఖరి రోజున నిమజ్జనం
- ప్రాచీన పండుగకు ఆదరణ ఏదీ?
- భావితరాలకు కనుమరుగవుతున్న వైనం

7



బొడ్డెమ్మ.. బొడ్డెమ్మా కోల్..
నీ బిడ్డ పేరేమీ కోల్..
నీ బిడ్డ నిలగౌరీ కోల్..
నిత్య మల్లెచెట్టేసి కోల్..
చెట్టుకు చెంబేడు కోల్..
నీళ్లు పోసి కోల్..
కాయలు, పిందెలు కోల్..
ఘనమై కాసెను కోల్..
అందుట్ల ఒక పిందె కోల్..
ఢిల్లీకి పాయేను కోల్..
ఢిల్లీలో తిప్పరాజు కోల్..
మేడకట్టించే కోల్..

......తెలంగాణ పల్లె పండుగ బొడ్డెమ్మ పండుగకు ఆడపడుచులు సిద్ధమయ్యారు. పూర్వకాలం నుంచి ఏటా బతుకమ్మ పండుగ ప్రారంభమయ్యే అమావాస్య రోజు ముందువరకు బొడ్డెమ్మ పండుగను యువతులు, బాలికలు వైభవంగా జరుపుకుంటారు. తొమ్మిది రోజుల పాటు పల్లె సుద్దుల గీతాలు, ప్రాచీన పాటలను చప్పట్లతో పాడుతూ సంబురంగా జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ ప్రారంభానికి ఒక రోజు ముందుగా నిమజ్జనం చేస్తారు. ఈ వేడుక నిర్వహించుకోవడం వలన చదువు, జ్ఞానం, ఆరోగ్యం సిద్ధించి మానసికంగా ఎంతో ఆనందంతో ఉంటారని నమ్మకం. వందల ఏళ్ల నుంచి ఆచార సంప్రదాయంగా బొడ్డెమ్మ వేడుకను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.



- వరంగల్ కల్చరల్

కన్నతల్లినే కడతేర్చాడు..

ఐరన్ పైపుతో కొట్టి చంపిన తనయుడు

జనగామ జిల్లాలో ఘటన

పోలీసుల అదుపులో నిందితుడు



లచ్చమ్మ (ఫైల్)

లచ్చమ్మ మృతదేహం

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 21: కన్నతల్లినే ఓ కసాయి కొడుకు హతమార్చిన ఘటన జనగామ జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో శనివారం ఉదయం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నమిలిగొండ గ్రామానికి చెందిన సముద్రాల లచ్చమ్మ (65) భర్త గత కొన్నేళ్ల క్రితం మృతి చెందగా ఒంటరిగా ఉంటూ కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు కాగా, చిన్న కుమారుడు సత్తయ్యకు మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకుబలమైన గాయమైంది. అప్పటి నుంచి సత్తయ్య కాజీపేటలో భార్య పిల్లలతో ఉంటున్నాడు. శుక్రవారం భార్య మమతతో కలిసి గ్రామానికి వచ్చిన అతడు అమ్మ వద్ద ఉంటానని చెప్పి భార్యను కాజీపేటకు పంపించాడు. కుమారుడు రాకరాక వచ్చాడని లచ్చమ్మ చికెన్ తీసుకువచ్చి కుమారుడికి వండి పెట్టింది. రాత్రి 10గంటల సమయంలో తల్లి, కొడుకు కలిసి భోజనం చేసి మాట్లాడుకుంటున్నారు. లచ్చమ్మకు ఉన్నటువంటి రేషన్‌కార్డులో సత్తయ్య పేరు ఉండడంతో కాజీపేటలో అతడు ఉంటున్న ఇంటి విద్యుత్ మీటర్‌కు గృహజ్యోతి పథకం, ఉచిత గ్యాస్ పథకాల లబ్ధిపొందుతున్నాడు. దీంతో ఆ పథకాల లబ్ధి తల్లి లచ్చమ్మకు వర్తించడం లేదు.

కొడుకుతో మాట్లాడుతున్న క్రమంలో కరెంట్ బిల్లు, గ్యాస్ పథకం నీపేరు మీద ఎందుకు చేసుకున్నావని తల్లి అడగడంతో పాటు, సత్తయ్యకు రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో భూమి విక్రయించిన బాపతు డబ్బులు విషయమై తల్లి, కొడుకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో తీవ్ర ఆవేశానికి గురైన సతయ్య అక్కడే ఉన్న ఐరన్ పైపుతో తల్లి తలపైన పలుమార్లు గట్టిగా కొట్టాడు. దీంతో తలపగిలి, మెదడు చిట్లి ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తల్లి అరుపులు వినబడడంతో పక్క ఇంట్లో ఉంటున్న లచ్చమ్మ పెద్ద కుమారుడు రాజు పరుగెత్తుకొని వచ్చి చూడగా నిందితుడు అతనిపై కూడా దాడి చేసే ప్రయత్నం చేశాడు. భయంతో గ్రామంలోకి పరుగెత్తిన రాజు చుట్టు ప్రక్కలవారిని తీసుకువచ్చి చూడగా రక్తపు మడుగులో ఉన్న లచ్చమ్మ అప్పటికే మృతి చెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలానికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతురాలి పెద్ద కుమారుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణు తెలిపారు.

సర్వే శాఖ పనితీరును మెరుగు పరుచుకోవాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ రూరల్, సెప్టెంబరు 21: సర్వే శాఖ పనితీరును మెరుగు పరుచుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ఆశాఖ పనితీరు పై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హల్లో సహాయ సంచాలకుల ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భూ వివాదాలకు సంబంధించిన 486 ఫిర్యాదులు సర్వే చేయవలసి ఉన్నందున పనులో జాప్యం లేకుండా చూడాలన్నారు. అక్టోబరు 21 వరకు సర్వేలన్నీ పూర్తి చేయాలన్నారు. గూగుల్ షీట్ రూపొందించి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయా లన్నారు. టీఎం33లో ప్రభుత్వ స్థలాలు, కాలువలు, ఎఫ్‌టీఎల్ పరిధిలోని చెరువులు, కుంటలను సర్వేచేసి నివేదిక ఇవ్వాలన్నారు.

పంచాయతీ రాజ్ శాఖ పనులు పూర్తి చేయాలి

జనగామ రూరల్: పంచాయతీ రాజ్ శాఖ పనులను అక్టోబరు 15 కల్లా పూర్తి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లా పరిషత్ అభివృద్ధి పనుల ప్రగతిపై శనివారం జెడ్పీ కార్యాలయంలో సీఈవో వసంత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ రిజ్వాన్ బాషా అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా 2022-23, 2023-24లలో చేపట్టిన రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్, సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్‌ల కింద ఎంపీపీలు, జెడ్పీటీసీలకు గ్రాంట్ ద్వారా మంజూరైన అబివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. గ్రామాల పరిపుష్టికి కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించి పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. 100 శాతం పనులు పూర్తి చేసిన 4 మండలాలను ఎంపిక చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీపీవో స్వరూప, మండలాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి..

- పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
- గాంధీ భవనంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ నేతలతో సమావేశం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ నాయకులు

6లో

కల నెరవేరేదెన్నడో..?



పాలకుర్తి ఆస్పత్రి ఇదే

- అమలుకు నోచుకోని పాలకుర్తిలోని 50 పడకల ఆస్పత్రి నిర్మాణం
- ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం ప్రకటన
- ఆచరణకు నోచుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పాలకుర్తి, సెప్టెంబరు 21 : వ్యాపార, వాణిజ్య పరంగా దినదినాభివృద్ధి చెందుతున్న పాలకుర్తి ప్రజల అవసరాలకు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తామని ప్రకటించిన 50 పడకల ఆస్పత్రి నిర్మాణం కలగానే మారింది. వివరాల్లోకి వెళితే... 1981లో అప్పటి ఎమ్మెల్యే స్వర్గీయ యతిరాజారావు హయాంలో పాలకుర్తికి 30 పడకల ఆస్పత్రిని మంజూరు చేసి నిర్మాణం చేట్టి వైద్య సేవలు అందిస్తున్నారు. 2009లో పాలకుర్తి నియోజకవర్గం కేంద్రంగా రూపాంతరం చెందింది. కానీ అందుకు తగిన విధంగా వైద్య సౌకర్యాలు మాత్రం కల్పించలేదు. నాటి నుంచి ఇప్పటి వరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న చందంగా ఉంది ఆస్పత్రి పరిస్థితి.

పాలకుర్తి పట్టణంలోనే 10 వేల మంది జనాభా వరకు ఉండగా, మండలం మొత్తంగా సుమారు 60 వేల మంది పైగా జనాభా ఉంటుంది. వీరితో పాటు నియోజకవర్గ కేంద్రానికి చుట్టు పక్కల మండలాలకు చెందిన ప్రజలు నిత్యం వైద్యం కోసం ఈ ఆస్పత్రికి వస్తుంటారు. నియోజకవర్గంలో చాలా వరకు గిరిజన ప్రజలు ఉండటంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే స్తోమత లేక వారు ప్రభుత్వ ఆస్పత్రికే వస్తుంటారు. ఈ ప్రాంత జనాభా అవసరాలకు తగ్గట్టుగా వైద్య సేవల అభివృద్ధి జరుగలేదు. ప్రజల కోరిక మేరకు మూడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఉన్నత శ్రేణి ఆస్పత్రిగా అప్‌గ్రేడేషన్ చేసింది. కానీ అందుకు అనుగుణంగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు.

ఆశించిన స్థాయిలో అందని వైద్య సేవలు

పాలకుర్తి 30 పడకల నుంచి ఉన్నత శ్రేణి ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ ఇక్కడి ప్రజలకు ఆశించిన స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని విమర్శలొస్తున్నాయి. అయితే ఈ ప్రాంత ప్రజలు మాత్రం 50 పడకల ఆస్పత్రిగా మార్చాలని కోరుతున్నారు. ఈ ప్రాంతంలో ఇద్దరు మాజీ మంత్రులు మాజీ మంత్రి స్వర్గీయ యతిరాజారావు, నిన్న వరకు పాలకుర్తి నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కూడా 50 పడకల ఆస్పత్రిగా మార్చడంలో విఫలమయ్యారు. గత ఎన్నికల ముందు మాజీ మంత్రి దయాకర్‌రావు, రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును తీసుకువచ్చి 50 పడకల ఆస్పత్రి కోసం అప్‌గ్రేడ్‌కు ప్రకటించారు కానీ ఆచరణకు నోచుకోలేక పోయిందని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆస్పత్రిలో సిబ్బంది కొరత ...


పాలకుర్తిలోని ప్రాథమిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల, సిబ్బంది కొరత ఉంది. ప్రభుత్వ ఆస్పత్రిలో నలుగురు డాక్టర్లు ఉండాల్సి ఉంది. అయితే ఇద్దరు డాక్టర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మరో ఇద్దరు డాక్టర్లను నియమించాల్సి ఉంది. ఫీల్డ్ స్టాఫ్ 11 మంది ఏఎన్ఎంలు పని చేస్తుండగా అందులో ఒక్కరు మాత్రమే రెగ్యూలర్ ఉద్యోగి కాగా, మిగిలిన 10 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది. వీరితో పాటు 60 మంది ఆశావర్కుర్లు పని చేస్తున్నారు. ఆపరేటర్ లేక గత కొన్నేళ్లుగా ఎక్స్‌రే ప్లాంట్ మూలన పడింది. దానిని పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి. మండలంలో 6 పల్లె దావాఖానాలు ఉండగా వాటిలో నాలుగు దావఖానాల్లో మాత్రమే వైద్యసిబ్బంది విధులు నిర్వహిస్తున్న పరిస్థితి ఉంది.

ఆసత్రిలో ప్రతీ రోజు 200 నుంచి 300 వరకు ఓపీ ఉంటుంది. అయితే ఉన్నత శ్రేణి ఆస్పత్రి వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండరని విమర్శలున్నాయి. ఆస్పత్రి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వైద్యులు డ్యూటీలకు డుమ్మాకొట్టడంతో ఇటీవల ఒక డాక్టర్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు. అయినా ఆస్పత్రిలో సిబ్బంది తీరులో పెద్దగా మార్పులేదని పలువురు వాపోతున్నారు.

నిరుపయోగంగా పోస్టుమార్టం గది

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం పోస్టుమార్టం గది నిర్మాణం చేపట్టి ప్రారంభించారు. నిర్మాణం పూర్తయి రెండేళ్లు కావస్తున్నా ఇప్పటికీ అది వినియోగంలోకి రాలేదు. పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల, జఫర్‌గడ్ మండలాల ప్రజలకు పాలకుర్తిలో పోస్టుమార్టం వినియో గంలోకి తీసుకు వస్తే ఈ ప్రాంత ప్రజలు జనగామకు వెళ్లాల్సి అవసరం ఉండదు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తాం..



పాలకుర్తి ప్రజలకు ఆస్పత్రిలో వైద్యసేవలు అందిస్తున్నాం. 24 గంటల పాటు వైద్య సిబ్బంది అందబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసే విషయంలో ప్రభుత్వం నుంచి ఇంత వరకు ఎలాంటి సమాచారం లేదు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే వెంటనే భవనం నిర్మాణం పనులు చేపడుతాం.

- రవిందర్‌గౌడ్, డీఎంహెచ్‌వో జనగాం

మహేష్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కడియం



పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే కడియం, ఎంపీ కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 21: ఇటీవల తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా ఎంపికైన బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్యలు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

దేవరుప్పులలో ఉద్రిక్తత

ఇద్దరు బీఆర్ఎస్ నేతల అరెస్టుతో కలకలం

కార్యకర్తలతో మాజీ మంత్రి ఎర్రబెల్లి ర్యాలీ, ధర్నా

సముదాయించిన వర్ధన్నపేట ఏసీపీ

డీసీపీ హామీతో దయాకర్‌రావు ఆందోళన విరమణ



దయాకర్‌రావుతో మాట్లాడుతున్న వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య

దేవరుప్పుల, సెప్టెంబరు 21: దేవరుప్పుల మండలంలోని చిన్నమడూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ వంగ కళమ్మ కుమారుడు అర్జున్, మాజీ ఎంపీటీసీ గొడుగు సుజాత భర్త మల్లికార్జున్‌లను శనివారం పోలీసులు అరెస్టు చేయడం ప్రకంపనలు సృష్టించింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండలకేంద్రానికి వచ్చారు. కార్యకర్తలతో కలిసి పార్టీ కార్యాలయం నుంచి పోలీసుస్టేషన్ వద్దకు ర్యాలీగా బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇంతలో వర్ధన్నపేట ఏసీపీ అక్కడికి చేరుకుని దయాకర్‌రావుతో మాట్లాడారు. తమ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టారని ఎర్రబెల్లి ధ్వజమెత్తారు. మాట్లాడే పని ఉందని పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి.. అర్జున్, మల్లికార్జున్‌లను పిలిపించి అదుపులోకి తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో ఏసీపీ నర్సయ్య జనగామ డీసీపీతో ఫోన్‌లో దయాకర్‌రావుతో మాట్లాడించారు. జనగామ డీసీపీ హామీతో ఆందోళన విరమించారు. ఆ తర్వాత కార్యకర్తలతో దేవరుప్పుల పోలీస్‌స్టేషన్‌వరకు వెళ్లి పాండురంగారావును కిడ్నాప్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు ఇప్పించారు. ఈ నిరసనలో జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, కొడకండ్ల పాలకుర్తి దేవరుప్పుల

మిగతా 8వ పేజీలో...

దేశంలో బీజేపీకి తిరుగులేదు

కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్

జనగామ రూరల్, సెప్టెంబరు 21: ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ పార్టీ బీజేపీ అని, దేశంలో బీజేపీకి తిరుగులేదని కేంద్ర మత్స్య, పశు సంవర్ధశాఖ, పాడి పరిశ్రమలు, మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జిల్లా కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై జిల్లా స్థాయి కార్యశాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జార్జ్ కురియన్ హాజరై మాట్లాడారు. బీజేపీ గత కొన్నేండ్ల నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తుండగా.. ఈసారి కొత్తగా డిజిటల్ విధానంలో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నామని తెలిపారు. 8800002024 కు మిస్ కాల్ ఇస్తే సభ్యత్వం నమోదు అవుతుందన్నారు. ప్రతీ ఒక్క బూత్‌లో రెండు వందలు సభ్యత్వాలు చేసి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలన్నారు. పార్టీ కార్యకర్తకు సమయం వచ్చినప్పుడు తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి ప్రతీ ఒక్కరు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మార్తినేని ధర్మారావు, ఉడుగుల రమేష్, హరిచంద్రగుప్త, కేవీఎల్ఎన్ రెడ్డి, కొంతం శ్రీనివాస్, కత్తుల లక్ష్మి పాల్గొన్నారు.

రేపు విద్యుత్ పోల్ ఎక్కే పరీక్ష

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 21: జూనియర్ లైన్‌మెన్ నియామకం కోసం సోమవారం ములుగురోడ్డులోని ఉత్తర విద్యుత్ శిక్షణ సంస్థ (ఎన్‌పీటీఐ) పోల్ ఎక్కే పరీక్ష నిర్వహిస్తున్నట్లు హనుమకొండ ఎస్ఈ కె. వెంకటరమణ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఉదయం 9 గంటల హాజరుకావాలన్నారు. ఎంపిక పూర్తి పారదర్శకంగా ఉంటుందని, ఏలాంటి దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి..

పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

గాంధీ భవనంలో ఉమ్మడి జిల్లా పార్టీ నేతలతో సమావేశం



హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సమావేశమైన పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, తదితరులు

హనుమకొండ, సెప్టెంబరు 21, (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ పిలుపు నిచ్చారు. పార్టీలకతీతంగా జరిగే ఈఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, మద్దతుదారులు ఎక్కువ మంది ఎన్నికయ్యేలా గ్రామీణస్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలే ప్రధాన ఎజెండాగా ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయంకోసం పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, రూపొందించుకోవలసిన కార్యప్రణాళికపై నేతలకు దశదిశా నిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పని చేయనివారికి రాజకీయ భవిష్యత్తు ఉండదని పరోక్షంగా హెచ్చరించారు. ఎమ్మెల్యే అయినా, ఎంపీ అయినా ఎవరైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం చేసిన కృషి గీటురాయిగా ఉంటుందని, దానిని బట్టే వారికి రాజకీయ భవిష్యత్తు, పార్టీలో సముచిత స్థానం ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వీటిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లడం ద్వారా గ్రామీణ స్థాయిలో పార్టీ బలోపేతానికి ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు కృషి చేయాలని అన్నారు. ఒక పక్క అభివృద్ధిని కొనసాగిస్తూనే గ్రామీణ స్థాయిలో పార్టీని క్రియాశీలకంగా నిలిపే ప్రక్రియ సమాంతరంగా సాగాలని మహేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. పార్టీపై నిర్లక్ష్యంగా వ్యవహరించేవారి పట్ల కఠిన చర్యలు ఉంటాయన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ కోసం ఎవరు కష్టపడి పని చేసింది? ఎవరు పని చేయనిది మొత్తం వివరాల చిట్టా పార్టీ అధిష్ఠానం దగ్గర ఉందని పేర్కొన్నారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో విజయానికి గ్రామ స్థాయిలో సమర్థత కలిగిన నేతలను ఇప్పటి నుంచే గుర్తించాలని మహేష్‌కుమార్ ఆదేశించారు.

కాగా, ఇప్పుడున్న కమిటీలన్నిటినీ రద్దు చేయడంతో పాటు కొత్త కమిటీలను సమర్థులైనవారితో నియమించాలన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. ఈ కమిటీల ఏర్పాటులో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కూడా భాగస్వామ్యం చేయాలన్న నిర్ణయాన్ని తీసుకున్నట్టు తెలిసింది. లోకల్ బాడీ ఎన్నికలు దగ్గరపడుతున్నందున అభ్యర్థులను నిలబెట్టడానికి ఇప్పటి నుంచే కసరత్తు మొదలు పెట్టాలని ఎమ్మెల్యేలను పార్టీ అధ్యక్షుడు ఆదేశించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తుమీద జరుగుతున్నప్పటికీ సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు మాత్రం పార్టీలతో సంబంధం లేకుండా జరుగనున్నందువల్ల ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గం పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పార్టీ నైతిక మద్దతుతో గెలిచే అవకాశం స్థానిక నాయకులను ఎంపిక చేయడంపై దృష్టి సారించాలని సమావేశం సూచించింది. గత ఎన్నికల్లో మెజారిటీ స్థానిక సంస్థలను బీఆర్ఎస్ గెలుచుకున్న నేపథ్యంలో ఈ సారి ఆ పార్టీకి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా సమగ్రమైన కార్యప్రణాళికను రూపొందించుకొని ప్రతిపక్ష పార్టీలకన్నా ఒకింత ముందుండాలని సమావేశం పిలుపు నిచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న మొత్తం 1,688 గ్రామ పంచాయతీల్లో దాదాపు అన్నిటినీ కైవసం చేసుకునేలా సమష్టిగా కృషి చేయాలని పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పిలుపునిచ్చారు. మంత్రి కొండా సురేఖ ఉమ్మడి జిల్లాలో పార్టీ పరిస్థితి, గ్రామీణ స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు భవిష్యత్తులో కానున్న సన్నద్ధతను వివరించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవడం, ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడం, వివిధ స్థాయిలో పార్టీ నేతల మధ్య సమన్వయం సాధించడం ద్వారా స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించగలమన్న విశ్వాసాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యక్తం చేశారు. ఈసమావేశంలో ఏఐసీసీ పక్షాన విశ్వనాథ్, విష్ణునాథ్‌తో పాటు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనా రాయణ రావు, రాంచంద్ర నాయక్, కేఆర్ నాగరాజు, అశ్విసీరెడ్డి, కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు రాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎంపీలు కడియం కావ్య, బలరాం నాయక్, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు పాల్గొన్నారు.

రైళ్ల ట్రాఫిక్‌కు ఇక చెక్

ముగిసిన మూడో రైల్వేలైన్ నిర్మాణ పనుల ● వారంలో అందుబాటులోకి.. త్వరలో ట్రయల్ రన్



సారంగమార్గం ట్రాక్‌వద్ద రిబ్బన్ కట్‌చేస్తున్న సేఫ్టీ ఆఫీసర్ మాధవి

కాజీపేట, సెప్టెంబరు 21: కాజీపేట - హసన్‌పర్తి - వరంగల్ మధ్య మూడో రైల్వే లైన్ నిర్మాణం పూర్తయింది. ఇక నుంచి ఢిల్లీ నుంచి వరంగల్ మీదుగా చెన్నై, ఢిల్లీ నుంచి కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్లే రైళ్ల ట్రాఫిక్‌కు తెర పడనుంది. హసన్‌పర్తి నుంచి వరంగల్, హసన్‌పర్తి నుంచి కాజీపేట వరకు అదనంగా మూడో రైల్వే లైన్ నిర్మాణం పూర్తయ్యింది. 2021లో ప్రారంభమైన ఈ ట్రాక్ నిర్మాణం.. హసన్‌పర్తి నుంచి వరంగల్ వరకు 21 కిలోమీటర్ల, హసన్‌పర్తి నుంచి కాజీపేట వరకు 10 కిలోమీటర్ల మేర ట్రాక్‌నిర్మాణం చేశారు దీంతో బల్లార్ష నుంచి వరంగల్ వైపు, బల్లార్షా నుంచి కాజీపేట మీదుగా సికింద్రాబాద్ వెళ్లే రైళ్లకు ఎలాంటి అంతరాయం లేకుండా రాకపోకలు సాఫీగా జరుగనున్నాయి. గతంలో న్యూఢిల్లీ నుంచి వరంగల్ వైపు రైలు వెళ్లాలంటే అదే లైన్‌లో కాజీపేట వైపు వెళ్లే రెలును ఆపి వరంగల్ వైపు వెళ్లే రెళ్లను పంపించేవారు. కాజీపేట వైపు రెళ్లను పంపించాలంటే వరంగల్ వైపు వెళ్లే రైలును ఆపాల్సిన పరిస్థితి. దీంతో ప్రతీరోజు గూడ్స్ రైళ్లతో కలిపి సుమారు 150 రైళ్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలగడమే కాకుండా రైల్వేకు అపారమైన నష్టం జరిగేది. ప్రస్తుతం కాజీపేట వైపు అదనంగా మరో ట్రాక్, వరంగల్ వైపు అదనంగా మరో ట్రాక్ నిర్మించడంతో మొత్తంగా ఈ రూట్‌లలో నాలుగు రైల్వే లైన్‌లు ఏర్పడ్డాయి. కొత్తగా నిర్మించిన ట్రాక్‌లను రైల్వే సేఫ్టీ అధికారి మాధవి పరిశీలన పూర్తయ్యింది. మరో రెండు రోజుల్లో కొత్త ట్రాక్‌లపై ట్రయల్ రన్ చేపట్టనున్నారు. అనంతరం ఈ ట్రాక్‌ల మీదుగా పూర్తిస్థాయి రైళ్లను నడపనున్నారు.

ఇదే రూట్‌లో సారంగ మార్గం

కాజీపేట - హసన్‌పర్తి రైల్వేస్టేషన్‌ల మధ్య రైల్ అండర్ బ్రిడ్జి (సారంగ మార్గం) నిర్మాణం ప్రత్యేకం కానుంది. రైళ్ల రాకపోకలకు అంతరాయం కలుగకుండా ఈ సారంగ మార్గంలో సుమారు 340 మీటర్ల బ్రిడ్జిని నిర్మించారు. ఈ బ్రిడ్జి మీదుగా ఒకేసారి రెండు రైళ్లు, బ్రిడ్జి కింద నుంచి మరో రైలు రాకపోకలు సాగించనున్నాయి. ఈనెల 19 నుంచి మూడురోజుల పాటు ఈ రైలు మార్గాలను రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి బృందం పర్యవేక్షించింది. మూడో రైల్వే లైన్‌లు, సారంగమార్గం ట్రాక్ నిర్మాణంపై ఆమె పూర్తి స్థాయి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి సారంగమార్గ నిర్మాణాలు మరిన్ని చేపట్టడానికి రైల్వే అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం సేఫ్టీ కమిషనర్ మాధవి బృందం రిబ్బన్ కట్‌చేసి కొబ్బరికాయలు కొట్టి, బ్రహ్మణుల వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు కూడా చేశారు. ప్రయోగాత్మకంగా నిర్మించిన ఈ ట్రాక్‌లు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా ఉండాలని విజయవంతం కావాలని ఆమె కోరుకున్నట్లు తెలిసింది. ఆమె ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తే వెంటనే ట్రయల్ రన్‌చేసి వారం రోజుల్లో ఈ ట్రాక్ మీదుగా పూర్తిస్థాయి రైళ్లను నడపడానికి రైల్వే అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు.

బొడ్డెమ్మ బొడ్డెమ్మా.. కోల్..

● ఆడబిడ్డల పండుగ బొడ్డెమ్మ వేడుకలకు సిద్ధమైన పల్లెలు ● రేపటి నుంచి సాగనున్న సంబరం ● తొమ్మిది రోజుల పాటు సందడే సందడి



బొడ్డెమ్మ



బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు (ఫైల్)

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 21: తెలంగాణ పల్లెల్లో ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ యువతులు, చిన్నారులు యేటా జరుపుకొనే బొడ్డెమ్మ పండుగ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. కుంటున్నారు. నేటి కంప్యూటర్ కాలంలో కూడా బొడ్డెమ్మను తెలంగాణ ప్రాంతంలో జరుపుకోవడం మన సంస్కృతికి నిదర్శనం. రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి అనేక సంస్కృతి సంప్రదాయాలను కొనసాగించగా ప్రాచీన పండుగగా మొదలయ్యే నాలుగు పండుగల్లో మొట్టమొదటి పండుగ బొడ్డెమ్మ. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించకపోవడంతో పాటు ప్రోత్సహించకపోవడం వలన భావితరాల వారికి బొడ్డెమ్మ పండుగ తెలియకుండానే కనుమరుగు కానుంది. అయినా నేటికి సంస్కృతి సంప్రదాయబద్ధమైన బొడ్డెమ్మ పండుగను పల్లె, పట్టణ ప్రాంతాలు, నగరాల్లో ఆచరించుకుంటున్నారు. తొమ్మిది రోజుల పాటు కొనసాగే బొడ్డెమ్మ వేడుకలు మరి కొద్ది గంటల్లో ప్రారంభం కానున్నాయి.

బొడ్డెమ్మ ఎలా ఉంటుంది..?

బొడ్డెమ్మ అనే పదాన్ని అమ్మవారి నామాలలో ఒక నామంగా గుర్తించి బొడ్డెమ్మను పుట్టమన్నుతో తయారు చేస్తారు. ప్రజలు కాలుపెట్టని ప్రాంతానికి చెందిన మట్టి పుట్ట కాబట్టి పుట్ట మన్నును తెచ్చి పీటపై శ్రీచక్ర రూపంలో సహ ప్రాకారంగా గడులతో తయారుచేసి కింది నుంచి వెడల్పు, మీదికి కలశ రూపంలో సన్నగా తయారు చేస్తారు. ఒక ఆకారం తీసుకొచ్చి బొడ్డెమ్మగా రూపు దిద్దుతారు.

పూజా విధానం

ప్రకృతి సిద్ధమైన పుట్టమన్నుతో తయారు చేసిన బొడ్డెమ్మను ఎర్రమన్నుతో అందంగా అలికి చుట్టూరా పిండితో ముగ్గులు వేసి పసుపు బొట్లు, కుంకుమ బొట్లు పెట్టి పూలతో అలంకరిస్తారు. పైన రాగి చెంబును కలశంగా ఏర్పాటు చేసి కింద బొడ్డెమ్మ ముందు మట్టి ప్రమిద దీపాన్ని పెట్టి అగరబతుఉతలు ముట్టించి చిన్నారులు ఆట పాటలతో కీర్తిస్తూ పూజలు నిర్వహిస్తారు.

ఇంటింటి నుంచి బియ్యం

ప్రతీరోజు సాయంత్రం ఇంటి నుంచి చిన్నారులు ఆట పాటలు నిర్వహించుకోవడానికి బొడ్డెమ్మ వద్దకు బియ్యం, అటుకులు, చక్కర, బెల్లం తెస్తారు. తాము తెచ్చిన బియ్యాన్ని కలశంలో పోసి బొడ్డెమ్మ ఆట పాట నిర్వహించుకున్న అనంతరం అటుకులు, చక్కరను అందరికి ప్రసాదంగా పంచుతారు. తొమ్మిది రోజుల పాటు ఆట పాటలు నిర్వహించుకుంటారు.

ఆఖరి రోజు నిమజ్జనం

తొమ్మిదిరోజులపాటు ఆట పాటలతో బొడ్డెమ్మను భక్తి శ్రద్ధలతో అలంకరించి పూజించి తాము తెచ్చిన బియ్యం, బెల్లాన్ని ఆఖరిరోజు చపాతీ(రొట్టె)లు బెల్లంతో కలిపి లడ్డూలు తయారు చేసి అందరికి ప్రసాదంగా ఇస్తారు. ఆట పాటల అనంతరం వెళ్లి రావమ్మా.. బొడ్డెమ్మా అంటూ.. చెరువులు, కుంటలు, బావుల్లో బొడ్డెమ్మను నిమజ్జనం చేస్తారు.

కనుమరుగు కానున్న బొడ్డెమ్మ

ప్రాచీన పండుగల్లో ఒకటిగా ఉన్న పండుగ బొడ్డెమ్మ. తెలంగాణ ఏర్పాటు అనంతరం పండుగను గుర్తించిన ప్రభుత్వం.. సంప్రదాయమైన బొడ్డెమ్మను మాత్రం గుర్తించకపోవడం శోచనీయం. తరతరాల నుంచి పల్లె, పట్టణ ప్రాంతాల్లో, నగరాల్లో నేటికి నిర్వహించుకుంటున్న ఈ పండుగను గుర్తించకపోవడంతో కనుమరుగు కానుంది. భావితరాల వారికి తెలంగాణ సంస్కృతి పండుగలను అందించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. స్వచ్ఛంద సంస్థలు కూడా అనేక సంప్రదాయ పండుగలను గుర్తించి వేడుకలు నిర్వహించినా బొడ్డెమ్మను కూడా స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక సంస్థలు గుర్తించకపోవడం నిరాశకు గురిచేస్తోందని పలువురు మహిళలు పేర్కొంటున్నారు.

ఎగ్ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తా..

● కోళ్ల వ్యాధుల నివారణకు త్వరలో వ్యాక్సిన్
● కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి జార్జి కురియన్

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 21: ఆలిండియా ఎగ్‌బోర్డు ఏర్పాటు కోసం కృషి చేస్తానని కేంద్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ అన్నారు. శనివారం హనుమకొండ అశోకా కన్వెన్షన్ హాల్‌లో వరంగల్ జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోళ్ల వ్యాధులు నివారణకు వ్యాక్సిన్ తయారు చేయడం చివరి దశకు వచ్చిందని, త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం పౌల్ట్రీ పరిశ్రమల నిర్వాహకులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. ఐఎల్‌టీ, హెచ్‌పీ కారణంగా దేశవ్యాప్తంగా పౌల్ట్రీ ఫామ్స్ మూసివేస్తున్నారని, ఇప్పటికే కేరళ రాష్ట్రంలో సుమారు 14 పరిశ్రమలు మూసివేశారని గుర్తు చేశారు. కేంద్రం ప్రభుత్వం 109 రకాల గడ్డిని పెంచుకోవడానికి అనుమతి ఇచ్చే విధంగా కృషి చేస్తానన్నారు.

వరంగల్ జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ.. కరోనా కారణంగా పౌల్ట్రీ పరిశ్రమలు నష్టాల్లో కూరుకుపోయాయన్నారు. దేశంలో ఇప్పటికే చాలా వరకు పౌల్ట్రీ ఫామ్‌లు మూసివేస్తున్నారన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం గుడ్ల విక్రయాల్లో మొదటిస్థానంలో ఉండగా, రాజస్థాన్ చివరి వరుసలో ఉందన్నారు. అనంతరం పౌల్ట్రీ ఫార్మర్స్ పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కేంద్ర సహాయ మంత్రికి అందజేశారు. ఈ సమావేశంలో నేషనల్ ఎగ్ కో ఆర్డినేషన్ కమిటీ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వరంగల్ జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేసన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్. ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి ఎం.రాంప్రసాద్, ఉపాధ్యక్షుడు జి.రమణారెడ్డి, సీహెచ్. రవీందర్, శ్రీరాంనాయక్, ఎం.సుబ్బారావు, టి.శ్యాంసుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్, హీరో చంద్రహాస్

'రాంనగర్ బన్నీ' సినిమాను ఆదరించండి..

మీడియా సమావేశంలో సినిమా దర్శకుడు శ్రీనివాస్ విజ్ఞప్తి

వడ్డెపల్లి, సెప్టెంబరు 21: బుల్లితెర నటుడు ప్రభాకర్ తనయుడు చంద్రహాస్ హీరోగా పరిచయం అవుతున్న రాంనగర్ బన్నీ చిత్రాన్ని సమాజంలోని ప్రతీ ఒక్కరు ఆదరించాలని సినీ డైరెక్టర్ శ్రీనివాస్ కోరారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు హీరో చంద్రహాస్ మాట్లాడారు. ఈ సినిమా ప్రతీ ఒక్కరు చూసి ఎంజాయ్ చేసేలా ఉంటుందని అన్నారు. కామెడీ, సాంగ్స్, ఫైట్స్ అందరికీ నచ్చే విధంగా ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సినిమా వసూళ్లలో 10శాతం వరద బాధితుల సహాయార్థం రెండు తెలుగు రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్స్‌కు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. తెలుగు ప్రజలు అందరు ఆదరిస్తే ఈ సినిమా విజయవంతం అవుతుందని కోరారు. ఈ సినిమా అక్టోబరు 4న విడుదలవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బుల్లితెర నటుడు ప్రభాకర్, హీరోయిన్లు విస్మయశ్రీ, రిచాజోషి తదితరులు పాల్గొన్నారు.

నేడు పొలిటికల్ సైన్స్ అలూమ్నీ మీట్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న దృశ్యం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 21: కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం 'ది గ్రేట్ రీ యూనియన్' పేరుతో ఆదివారం నిర్వహిస్తున్నట్లు కేయూ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, సీనియర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం శనివారం తెలిపారు ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ మాట్లాడుతూ.. సెప్టెంబరు 22న ఆదివారం ఉదయం 10.30 గంటలకు కేయూ క్యాంపస్‌లోని పొలిటికల్‌సైన్స్ విభాగంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుగుతోందని చెప్పారు. రాష్ట్ర గ్రంథాలయం సంస్థ చైర్మన్, పొలిటికల్ సైన్స్ విభాగం పూర్వ విద్యార్థి డాక్టర్ మహ్మద్ రియాజ్, పొలిటికల్‌సైన్స్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్లు రఘురాంరెడ్డి, సమ్మాలాల్, సంజీవరెడ్డి, వీరన్న, హరిప్రసాద్, దినేశ్‌కుమార్‌లతో పాటు పొలిటికల్‌సైన్స్ విభాగం బీవోఎస్ చైర్మన్ డాక్టర్ కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ వడ్డెపల్లి నాగరాజు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ విజయ్‌కుమార్ తదితరులు హాజరుకానున్నారు. పూర్వ విద్యార్థులందరూ హాజరుకావాలని కోరారు.

క్యాంపస్‌లో ప్రత్యేక ఏర్పాట్లు

కేయూ క్యాంపస్‌లోని రాజనీతిశాస్త్రవిభాగంలో ఆదివారం జరిగే పూర్వ విద్యార్థుల సమ్మేళనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కేయూ క్యాంపస్‌లోని హ్యూమనిటీస్ బిల్డింగ్‌ను సర్వాంగసుందరంగా అలంకిరించారు ప్రత్యేక ఆహ్వాన ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో పొలిటికల్ సైన్స్ పూర్వ విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రధానంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి పెద్దఎత్తున పూర్వ విద్యార్థులు పాల్గొంటారు.

రైలు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన శశిధర్

హసన్‌పర్తి, సెప్టెంబరు 21: రైలు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన ఎల్లాపూర్ రైల్వేస్టేషన్‌లో శనివారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకా రం.. కుమ్రంభీం జిల్లా బెజ్జూరు మండల కేంద్రానికి చెంది న కొల్లంపాక శశిధర్ శనివారం ఉదయం ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లో హసన్‌పర్తికి వస్తున్నాడు. ఈ క్రమంలో హస న్‌పర్తి మండల ఎల్లాపూర్ రైల్వే స్టేషన్‌లో నెమ్మదిగా వెళ తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు దిగుతుండగా కిందపడ గా తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో రక్తస్రావం కావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. వెంటనే 108 సిబ్బంది బాధితుడిని ప్రథమ చికిత్స అందించి ఎంజీఎంకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించినట్లు బాధితుడి బంధువు హసన్‌పర్తికి చెందిన కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ తెలిపారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

కేయూ డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ ఫీజు గడువు 26

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 21: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న బీఏ, బీకాం, బీఎస్సీతోపాటు ఇతర కోర్సుల 1, 3, 5 సెమిస్టర్‌ల పరీక్షల ఫీజులను సెప్టెంబరు 26 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో అక్టోబరు 5వ తేదీ వరకు ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

గొర్రెల కాపరి మృతదేహం లభ్యం

ఐనవోలు, సెప్టెంబరు 21: గొర్రెల కాపరి మృతదేహం లభ్యమైన సంఘటన కక్కిరాలపల్లి గ్రామంలో వెలుగుచూసింది. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం కక్కిరాలపల్లికి చెందిన పిట్టల రాజు (26) అనే యువకుడు గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. మూడు రోజుల కిందట గొర్రెలను తోలుకపోయిన రాజు.. సాయంత్రం ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు గాలించిన అచూకీ లభించలేదు. గ్రామంలోని ఒక పాత ఇంటి నుంచి దుర్వాసన వస్తుందని భావించి ఇరుగు పొరుగు వారు వెళ్లి చూశారు. రాజు అప్పటికే మృతిచెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా కుళ్లిపోయిన మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడికి మద్యం తాగే అలవాటు ఉందని మద్యం సేవించాక తాగడానికి నీళ్లు లభించక మృతిచెంది నట్లు భావిస్తున్నారు. తన కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానం లేదని తండ్రి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక మృతికిగల కారణాలు తెలుస్తాయని ఎస్సై తెలిపారు. కాగా, మృతుడు అవివాహితుడు.

హస్తకళల అభివృద్ధికి చేయూతనందిస్తాం..


విశ్వకర్మ హస్తకళ మెటల్ క్లస్టర్‌ను ప్రారంభిస్తున్న సత్యనారాయణ

జనగామ రూరల్, సెప్టెంబరు 21: హస్తకళల అభివృద్ధికి చేయూత అందిస్తామని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెంబర్తిలో శనివారం విశ్వకర్మ హస్తకళ మెటల్ క్లస్టర్‌ను సత్యనారాయణ, ఎంఎస్ఎంఈ అధికారి చంద్రశేఖర్, డైరెక్టర్ డాక్టర్ గ్లోరి స్వరూప లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ హస్తకళల అబివృద్ధికి చేయూత అందిస్తామని, ఈఎస్ఐ హెల్త్ కార్డులు మంజూరు చేసి కార్పొరేట్‌లో మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. హస్తకళాకారులు ఉత్పత్తి చేసే కళాకృతులు గోల్కొండ హస్తకళల విక్రయ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి జీవనోపాధికి చేయుతనిస్తామన్నారు. కార్యక్రమంలో శంకర్ నాయక్, కీర్తన చారి, బల్దె సిద్ధిలింగం, అంబాల అంజనేయులు, మూల రవి, వేదంతా చారి, రాజు, నరసింహ చారి పాల్గొన్నారు.

పాల బిల్లుల సమస్యను పరిష్కరించాలి


గుత్తా అమిత్‌రెడ్డిని కలిసిన పాల ఉత్పత్తిదారుల సంఘ నాయకులు

జనగామ రూరల్, సెప్టెంబరు 21: విజయ డెయిరీ పాల ఉత్పతిదారుల సహకార సంఘ నాయకులు శనివారం పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమైక్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి పూల బొకే అందజేశారు. అనంతరం సమస్యలను చైర్మన్ అమిత్‌రెడ్డికి విన్నవించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు కాసారపు ధర్మారెడ్డి మాట్లాడుతూ పాల బిల్లుల సమస్యలను చైర్మన్ అమిత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో దామెర నాగరాజు, కుర్రెముల శ్రీనివాస్, ఎడబోయిన రవీందర్‌రెడ్డి జంగిటి అంజనేయులు, బోరెడి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి జనగామ క్రీడాకారులు

జనగామ రూరల్, సెప్టెంబరు 21: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో జనగామ క్రీడాకారులు సత్తాచాటారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ లో ఈనెల 19, 20న జరిగిన రాష్ట్ర స్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో జనగామ క్రీడాకారులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, జనగామ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ, కార్యదర్శి గంగిశెట్టి మనోజ్‌కుమార్‌లు మాట్లాడుతూ 18 సంవత్సరాల బాలుర విభాగంలో జీ.సునిత్‌కుమార్ షాట్‌పుట్, డిస్కస్ త్రో లో రెండు బంగారు పథకాలను సాధించడం జరిగిందన్నారు. 18 సంవత్సరాల బాలికల విభాగంలో అక్షయ సింధు డిస్కస్ త్రోలో స్విలర్, షాట్‌పుట్‌లో కాంస్య పతకాన్ని సాధించిందని తెలిపారు.

విద్యార్థుల అభివృద్ధికి బాధ్యత వహించాలి

నర్మెట, సెప్టెంబరు 21 : విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము అన్నారు. మండలంలోని మల్కపేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి డీఈవో రాము ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు విద్యలో రాణించాలంటే తల్లిదండ్రుల సహకారం ఉండాలన్నారు. అప్పుడే విద్యార్థులు విద్యలో ఉన్నత స్థాయికి వెళ్తారన్నారు. అనంతరం విద్యార్థులకు దాతలు అందించిన నోటు పుస్తకాలు, ప్లేట్స్, వాటర్ బాటిల్స్‌ను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఎంఎస్‌వో ఐలయ్య పాఠశాల ఉపాధ్యాయులు ఆంజనేయులు, మధుసూధన్, సీఆర్‌పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ కాలువ ద్వారా నీటి విడుదల

నర్మెట, సెప్టెంబరు 21 : మండలంలోని వెల్దండ రిజర్వాయర్ కాలువ ద్వారా శనివారం కాంగ్రెస్ నాయకులు నీటిని విడుదల చేశారు. గత పదిహేను రోజులుగా వర్షాలు పడకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే రైతుల సాగునీటి సమస్యను డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి తెలిపారు. ఆయన వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెల్దండ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలని కోరారు. అధికారులు స్పందించడంతో కాంగ్రెస్ నాయకులు శనివారం వెల్దండ రిజర్వాయర్ కాలువ తూము గేటును ఎత్తి సాగునీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో నర్మెట గ్రామ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, ముక్కెర రాజేష్, చెవుల రాజు, శివరాత్రి మహేష్, సంగి మల్లేష్, పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి

పాలకుర్తి, సెప్టెంబరు 21: తెలంగాణ తొలిదశ ఉద్యమ కారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని ఆయన చిత్రపటానికి పద్మశాలీలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాపూజీ విగ్రహా ఆవిష్కరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మేడారపు సుధాకర్, గూడూరు చేనేత సహకార సంఘం చైర్మన్ రచ్చ కృష్ణమూర్తి, మాచెర్ల సారయ్య మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటులోనూ కొండా లక్ష్మణ్‌బాపూజీ ఘనతీయమైన పాత్ర పోషించారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూం టెక్స్‌టైల్ సంస్థకు ఆయన పేరు పెట్టడాన్ని పద్మశాలీలు హర్షం వ్యక్తం చేశారు. ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పెనుగొండ రమేష్, మార్గం లక్ష్మీనారాయణ, కాటబత్తిని రమేష్, డాక్టర్ రాపోలు సత్యనారాయణ, మాచెర్ల పుల్లయ్య, చిలుకమారి వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య, చిలుకమారి వాసుదేవ్, వరప్రసాద్ ఉన్నారు.

● జనగామ రూరల్: రాష్ట్ర సాధనలో కొండా లక్ష్మణ్ బాపూజీ కీలక భూమిక పోషించారని పద్మశాలి అఫీషియల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (పోపా) అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్లు అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా పోపా అధికార ప్రతినిధి పిట్టల సతీశ్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేవీఎస్ స్వామి, గుర్రం నాగరాజు, జనార్ధన్, ఎల్లయ్య, బాలనర్సయ్య, రావదయాకర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

● జఫర్‌గడ్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం జఫర్‌గడ్‌లో స్థానిక పద్మశాలి భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు, పద్మశాలీలు కొండా లక్ష్మణ్ చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు మామిడాల సోమనారాయణ మాట్లాడుతూ ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం టౌన్ అధ్యక్షుడు భైరి వెంకటేశ్వర్లు, మండల ప్రతినిధులు ఈరబత్తిని అంజయ్య, కొంగ యాదగిరి, చిలుకమారి అశోక్, కన్న వెంకట్రాంనర్సయ్య, భైరి అంజయ్య, పాము నర్సింహరాములు, కోమటి దామోదర్, మంగళపల్లి వెంకటేశ్వర్లు, భైరి సత్యనారాయణ, అనిల్, తదితరులు పాల్గొన్నారు.


పాలకుర్తిలో లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న చేనేత కార్మికులు

వెంకటేశ్వర స్వామి వార కల్యాణం

చిలుపూర్, సెప్టెంబరు 21 : మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వెంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి వార కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. శనివారం ఆలయ ఆవరణలో చేపట్టిన కళ్యాణ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కాగా, ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యుల వేదమంత్రాల మధ్య వేంకటేశ్వర స్వామి - పద్మావతి అమ్మవార్ల కల్యాణ వేడుకలను వైభవంగా ముగించారు. అనంతరం కల్యాణంలో కూర్చున్న కుటుంబాలకు స్వామివారి శేష వస్త్రాలతో పాటు, తీర్థప్రసాదాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వామివారి నిత్యసేవకులు, ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు, ధర్మకర్త సంగోజు మోహనాచారి, ఆలయ ఈవో మోహన్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, విశాల్, గాదె రాజశేఖర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.


చిలుపూర్ గుట్ట ఆలయంలో వెంకటేశ్వరుని కల్యాణం జరిపిస్తున్న పూజారులు

రూ.2 లక్షలు పలికిన వినాయకుడి లడ్డు

రఘునాథపల్లి, సెప్టెంబరు 21: మండలంలోనే గత 33 సంత్సరాల నుంచి అతి పెద్ద వినాయక విగ్రహాన్ని మండల కేంద్రంలోని బ్యాంకు స్ట్రీట్‌లో నెలకొల్పడం, 13వ రోజున నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. మండల కేంద్రంలో 13 రోజుల పాటు పూజలందుకున్న వినాయకుడి లడ్డు కోసం శనివారం సాయంత్రం నిర్వహించిన వేలం పాటలో విగ్రహ దాత మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ కుమార్తె సాయిదుర్గ రూ.2 లక్షల 16 రూపాయలకు లడ్డును దక్కించుకున్నారు. అనంతరం వినాయక విగ్రహాన్ని కమిటీ సభ్యులతో పాటు యువకులు ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఒడిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో తాజా మాజీ జడ్పీటీసీ బొల్లం అజయ్‌మణికంఠ, కోళ్ల వెంకటయ్య-వెంకటమ్మ, కోళ్ల సాయికుమార్, కోళ్ల రవిగౌడ్-స్వప్న, నిర్వహక కమిటీ సభ్యులు బొల్లం రంజిత్, కొన్నె సతీష్, నిఖేష్, రాజీవ్, సంతోష్, రఫీ, జహంగీర్, హరినాథ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన కొమ్మూరి వ్యతిరేక వర్గం

జనగామ రూరల్, సెప్టెంబరు 21: జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వ్యతిరేక వర్గం శనివారం కాంగ్రెస్ పెద్దలను కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని వారు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. జనగామలో జరుగుతున్న రాజకీయాలపై నాయకులకు వివరించారు.

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సీనియర్ నాయకులను పట్టించుకోకుండా ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారని వారికి తెలిపారు. అనంతరం క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డికి కొమ్మూరిపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కంచ రాములు, ఎర్రమల్ల సుధాకర్, వేమళ్ల సత్యనారాయణరెడ్డి, సర్వాల నర్సింగరావు, దూడల సిద్దయ్య, జాయ మల్లేశ్, చింతకింది మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం పార్టీలో చేరికలు

జనగామ రూరల్, సెప్టెంబరు 21: జనగామ జిల్లా కేంద్రానికి చెందిన చిలుకూరి మణిరత్నంతో పాటు యువకులు శనివారం సీపీఎం పార్టీలో చేరారు. జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ పార్టీ కండువ కప్పి వారిని పార్టీలోకి అహ్వానించి మాట్లాడారు. పేద ప్రజల కోసం పోరాడే పార్టీ సీపీఎం పార్టీ అని, రాబోయే రోజుల్లో యువకులకు పార్టీ సాముచిత స్థానం కల్పిస్తుందన్నారు. అనంతరం మణిరత్నం మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు నచ్చి తాను కూడా పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో పార్టీలో చేరడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పాము కృష్ణమూర్తి, బొట్ల శ్రావణ్, వెంకట మల్లయ్య, కళ్యాణం లింగం తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను ఎత్తివేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 21: మండలంలోని నమిలిగొండలో గత పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఐజల్ వాటర్ ప్లాంట్‌కు అయ్యే ఖర్చులను బరించలేకపోతున్నామని వెంటనే ప్లాంట్‌ను ఎత్తివేయాలని కోరుతూ ప్లాంట్ ఎదుట గ్రామస్తులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పదేళ్ల క్రితం ప్లాంట్ ఏర్పాటు చేసిన ప్లాంట్ అప్పు తీరలేదన్నారు. ఐజల్ కంపెనీ నిర్వహకులు ప్లాంట్‌పై వస్తున్న డబ్బులను తీసుకెళ్లి రిపేర్లు వచ్చినప్పుడు మాత్రం గ్రామస్థుల వద్ద నుంచి డబ్బులు వసూల్ చేసి రిపేర్లు చేయిస్తున్నారని తెలిపారు. వారం రోజుల క్రితం ప్లాంట్ మరల రిపేర్‌కు రాగా మిషన్‌లు కాలిపోయాయని తెలిపారు. ప్లాంట్‌ను తాము బరించలేకపోతున్నామని వెంటనే ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి జేసుమణికి నాయకులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు గాదె రాజు. ఆట్ల రాజు, అశోక్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, సోమిరెడ్డి, శ్రీను, రాజు, రమేష్, కుమారస్వామి, తిరుపతి, చందు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల క్షేత్ర పర్యటన


శివునిపల్లిలో బ్యాంకును సందర్శించిన మోడల్ స్కూల్ విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 21: స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థులు శనివారం క్షేత్ర పర్యటన నిర్వహించారు. స్థానిక కోటక్ మహీంద్రా బ్యాంకును సందర్శించారు. బ్యాంకులో నిర్వహించే ఆర్థిక నిర్వహణ, రుణాల వివరాలు, సాంకేతిక వినియోగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బ్యాంకు పథకాలు తదితర అంశాలను విద్యార్థులకు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. క్షేత్ర పర్యటన వల్ల విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం, భావ వ్యక్తీకరణ మెరుగు పడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్రా రెడ్డి, మంజుల, బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి కోదండరాం చేయూత

ఇంజనీరింగ్ చదివేందుకు ఆర్థిక సాయం


సాయి గణేష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం

జఫర్‌గఢ్, సెప్టెంబరు 21 : మండలంలోని సాగరంకు చెందిన చెందిన సాయిగణేష్ ఈ విద్యా సంవత్సరం ఇంటర్‌లో 954 మార్కులు సాధించి ఎంసెట్‌లో ర్యాంకు ఆధారంగా ఘట్‌కేసర్‌లోని ఆరోరా ఇంజనీరింగ్ కళాశాలలో సీటు వచ్చింది. అయితే తల్లిదండ్రులు నిరుపేదలు కావడంతో అక్కడ హాస్టల్‌లో ఉండి చదువుకునేందుకు ఆర్థిక సమస్యలతో చదువు ఆపివేసే పరిస్థితి నెలకొంది. దీంతో డీటీఎఫ్ రాష్ట్ర ప్రతినిధి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు గోపు సోమయ్య శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసి విద్యార్థి పరిస్థితిని వివరించారు. వెంటనే ఆయన స్పందించి విద్యార్థిని పిలిపించుకుని అభినందించి ఇంజనీరింగ్ చదివేందుకు హాస్టల్ ఫీజు డబ్బులు చెల్లించడమే కాకుండా భవిష్యత్తులో చదువులో ముందుకు సాగేందుకు అవసరమైన సహాయాన్ని అందిస్తానని భరోసా ఇచ్చారు. ఇందుకు సోమ య్య, విద్యార్థి కుటుంబీకులు కోదడరాంకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి

రఘునాథపల్లి, సెప్టెంబరు 21: కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 23(సోమవారం) తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎండి.మోహిస్ ముజ్తబ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకు ముందు ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతీ సోమవారం కలెక్టర్ కార్యాయంలో నిర్వహించే వారని, ఇక నుంచి ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మండల ప్రజలు, రైతులు ఎలాంటి సమస్యలు ఉన్న ప్రజావాణిలో దరఖాస్తుల రూపంలో అందించి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కోరారు.

సిద్దేశ్వర ఆలయ హుండీ లెక్కింపు

బచ్చన్నపేట, సెప్టెంబరు 21: మండలంలోని కొడవటూరు సిద్ధేశ్వర ఆలయంలో శనివారం ఆలయ పర్యవేక్షణ అధికారి వెంకటలక్ష్మి పర్యావేక్షణలో అధికారులు హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి రూ. 432198 ఆదాయం సమకూరినట్లు సీఈవో చిందం వంశీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి ఓంనమఃశివాయ, అర్చకులు, ఆలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి మండల స్థాయి క్రీడోత్సవాలు

రఘునాథపల్లి, సెప్టెంబరు 21: మండలంలోని వెల్ది మోడల్ స్కూల్ ప్రాంగణంలో ఈ నెల 27, 28న అండర్-14, అండర్-17 సంవత్సరాల బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక కోసం క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నామని మండల నోడల్ ఆఫీసర్ రఘునందన్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో శనివారం వ్యాయామ ఉపాధ్యాయులతో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడా పోటీలలో అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనేలా పీఈటీలు చూడాలని సూచించారు. సమావేశంలో పీఈటీలు రాజేందర్, రాజయ్య, ఖుద్దూస్, చందర్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

● పాలకుర్తి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో మండల స్థాయి కబడ్డీ, ఖోఖో ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ అధికారి పోతుగంటి నర్సయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో పీఈటీలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ముఖ్యఅతిథిగా నర్సయ్య హాజరై మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 14, 17 ఏళ్ల బాల, బాలికలు కబడ్డీ, ఖోఖో ఆడేందుకు ఈ ఎంపిక క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. 27న, బాలురకు గూడూరులో, 28న బాలికలకు పాలకుర్తిలో తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల్లో ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి మామిండ్ల సోంమల్లు, కన్వీనర్ కూటికంటి శ్రీనివాస్, పీఈటీలు చిట్యాల యాదగిరి, కొడిశాల అశోక్, అందె స్పందన, మనోహర్, మధు, గణేష్, శ్రీనివాస్, శరత్, స్వప్న, సాంబరాజు ఉన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య ధర్నా


భర్త ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న సంధ్య

తరిగొప్పుల, సెప్టెంబరు 21: అదనపు కట్నం తెస్తేనే కాపురానికి రావాలంటూ భర్త వేధిస్తున్నాడంటూ ఓ మహిళ తన కూతురుతో కలిసి భర్త ఇంటి ఎదుట ధర్నాకు దిగిన ఘటన శనివారం మండలంలోని అక్కరాజుపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, బాధిత మహిళ తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన సుంకరి సంధ్య (33) అదే గ్రామానికి చెందిన పురుమని సంపత్‌ని 10 సంవత్సరాల క్రితం వివాహం చేసుకుంది. వారికి ఓ కూతరు పుట్టిన తరువాత సంపత్ అదనపు కట్నం తీసుకువస్తేనే కాపురానికి రావాలంటూ సంధ్యను తల్లిగారింటికి పంపించాడు. అనంతరం గ్రామస్థులు ఎన్నిసార్లు పంచాయతీ నిర్వహించినా ఫలితం లేకపోయింది. ప్రస్తుతం వారి కూతురు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. ఇటీవల సంపత్ గుట్టుచప్పుడు కాకుండా రెండో పెళ్లి చేసుకున్నాడని తెలిసి సంధ్య శనివారం కూతురుతో కలిసి భర్త ఇంటి ఎదుట న్యాయం చేయాలంటూ ధర్నాకు దిగింది. విషయం తెలిసి సంపత్ ఇంటికి తాళం వేసి వెళ్లిపోయాడు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

రఘునాథపల్లి, సెప్టెంబరు 21: మహిళలు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ కృష్ణమోహన్ అన్నారు. మండలంలోని కోమల్ల రైతు వేదిక భవనంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక అక్షరాస్యత, కస్టమర్ మీట్ అండ్ క్రెడిట్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి బ్యాంకు జోనల్ మేనేజర్ ధరసింగ్ నాయక్ అధ్యక్షత వహించగా, రీజనల్ మేనేజర్ కృష్ణమోహన్ హాజరై మాట్లాడారు. బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలన్నారు. మహిళ శక్తి ద్వారా మహిళలకు గేదెలు, ఆవులు, నాటు కోళ్ల పెంపకం కోసం రుణాలు అందిస్తామని, బ్యాంకు రుణాలు మహిళల ఆర్థిక ఎదుగుదలకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్, ఎల్‌డీఎం శ్రీధర్, మేనేజర్ ప్రవీణ్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ వేణు, ఐకేపీ ఎపీఎం సారయ్య, సీసీలు సంపత్, రీనావతి, వీవో అధ్యక్షురాలు లలిత, మేకల వరలక్ష్మి, వీవోఏలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొడకండ్ల, సెప్టెంబర్ 21: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో అతిథి అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భానుప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ తెలుగు, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టులు బోధించుటకు అర్హులైన వారు ఈనెల 23 సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్

ఘనంగా మీలాద్ ఉన్ నబీ పండుగ

జనగామ రూరల్, సెప్టెంబరు 21: జనగామ జిల్లా కేంద్రంలో మీలాద్ ఉన్ నబీ పండుగ(మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు) ఘనంగా నిర్వహించారు. ఏక్ మీనార్ మసీద్ వద్దా ముస్లిం డెవలప్మెంట్ కమిటీ అధ్యక్షుడు జమాల్ షరీఫ్, మోమిన్ యూత్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ రాఫీ మతీన్ అధ్వర్యంలో మషయరా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ పార్థసారధి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ముస్లింలు, హిందువులు ఐక్యంగా ఉంటూ పండుగలు జరుపుకోవాలన్నారు.

చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించాలి

జనగామ రూరల్, సెప్టెంబరు 21: ఈనెల 26న చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించాలని ఉత్సవ కమిటీ జిల్లా కన్వీనర్ ఉల్లెంగుల రాజు అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం రజక సంఘం నాయకుల ముఖ్య సమావేశం నిర్వహించారు. చాకలి ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా ఉల్లెంగుల రాజు, కమిటీ సభ్యులు ఉల్లెంగుల రాజు, ఉల్లెంగుల శ్రీనివాస్, కొలిపాక నర్సింహులు, ఉల్లెంగుల రామకృష్ణ, ఏదునూరి సారయ్య, ఉల్లెంగుల శంకర్ ఉల్లెంగుల రాజులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ చాకలి ఐల్లమ్మ జయంతి పండుగ వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

నియోజకవర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలి

జఫర్‌గడ్, సెప్టెంబరు 21 : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి తగు ప్రాతినిధ్యం కల్పించాలని జఫర్‌గఢ్ మండల పార్టీ ప్రజా ప్రతినిధులు, జిల్లా, మండల నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు విన్నవించారు. రాష్ట్ర కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా మహేశ్‌కుమార్‌ను శనివారం మండలానికి చెందిన కాంగ్రెస్ నేతలు పుష్పగుచ్చం అందించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర కమిటీ ఏర్పాటు, నూతన నియామక పదవుల్లో స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఆయా మండలాలకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన వారిలో జఫర్‌గడ్ సొసైటీ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుజ్జరి రాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల అయిలయ్య, మాజీ ఎంపీపీ గాదెపాక అయోధ్య, సొసైటీ మాజీ చైర్మన్ కుల్ల మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

దేవరుప్పులలో ఉద్రిక్తత

(5వ పేజీ తరువాయి)

మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు తీగల దయాకర్, రామోజీ, నాగిరెడ్డి, బస్వ మల్లేశం, రామ్‌సింగ్, చింత రవి, సోమనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల జోలికొస్తే ఊరుకోం..

అధికారం ఉందని బీఆర్ఎస్ నాయకుల జోలికొస్తే ఊరుకునేది లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హెచ్చరించారు. తమ పార్టీ నాయకుల అక్రమ అరెస్టులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. భూదందాలు, కిడ్నాప్‌లు, మైనింగ్, ఇసుక మాఫియా కాంగ్రెస్ నాయకులే చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతో పోలీసులు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని, ఎన్ని కేసులు పెట్టినా భయపడమని, జైలుకు వెళ్లడానికైనా సిద్ధమన్నారు. కిడ్నాప్‌కు గురైన పాంగురంగారావు కాంగ్రెస్ నేతలపై ఫిర్యాదు చేస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. 26వ తేదీ వరకు కాంగ్రెస్ నాయకులపై కేసులు పెట్టకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతో కలిసి పెద్దఎత్తున ధర్నా చేస్తామన్నారు. 14నెలల కిందట జరిగిన లావాదేవీలను ఫిర్యాదుగా తీసుకొని అర్జున్, మల్లికార్జున్‌లపై అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. ఈ నిరసనలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, పలు మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల రిమాండ్

చిన్నమడూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు వంగ అర్జున్, గొడుగు మల్లికార్జున్‌లను శనివారం దేవరుప్పుల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దేవరుప్పుల ఎస్సై సృజన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ధ్రువ ప్రాజెక్టు ద్వారా చిన్నమడూరు గ్రామంలో పామ్‌లాండ్ వెంచర్ చేస్తుండగా దాని అనుమతి కోసం అప్పటి గ్రామ అప్పటి సర్పంచ్ వంగ కళమ్మ దగ్గరికి కాసాని ఉమామహేశ్వర్‌రావు వెళ్లాడు.

ఆమె కుమారుడైన వంగ అర్జున్, అప్పటి ఎంపీటీసీ గొడుగు సుజాత భర్త మల్లికార్జున్‌లు ఉమామహేశ్వర్‌రావు, అతడి భాగస్వాములను బెదిరించారని ఎస్సై తెలిపారు. అపై వారి వద్ద నుంచి రూ.9.25లక్షలను ఫోన్‌పే, అకౌంట్ ద్వారా తీసుకున్నారని ఎస్సై తెలిపారు. కాగా, బాధితుల ఫిర్యాదు మేరకు అర్జున్, మల్లికార్జున్‌లపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి జనగామ కోర్టులో హాజరు పర్చగా 14రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్సై సృజన్‌కుమార్ వెల్లడించారు.

వేధింపులు తాళలేక

తల్లీ కూతుళ్ల బలవన్మరణం

● తరిగొప్పులలో విషాదఛాయలు ● ముగిసిన అంత్యక్రియలు



తరిగొప్పుల, సెప్టెంబరు 21: కట్టుకున్న వాడి వేధింపులు తాళలేక కూతురితో సహా తల్లి బావిలోకి దూకి బలవన్మరణానికి పాల్పడగా తరిగొప్పులలో విషాదఛాయలు అములుకున్నాయి. స్థానికులు తెలపిన వివరాలు ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సాంబారి రాజేశ్వర్, శారద దంపతులు కొంత కాలం క్రితం బతుకుదెరువు కోసం సిద్దిపేట జిల్లా బెజ్జంకికి వలసవెళ్లారు. వీరికి కుమార్తె స్పందన(14), కుమారుడు రఘువరుణ్ ఉన్నారు. రాజేశ్వర్ తాగుడుకు బానిసై నిత్యం భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా రాజేశ్వర్ గొడవపడటంతో జీవితంపై విరక్తి చెందిన శారద, కూతురుతో కలిసి బెజ్జంకి శివారులోని ఓ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను తరిగొప్పులకు తీసుకురాగా విశాదఛాయలు అలుముకున్నాయి. శనివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ మండల నాయకులు పరామర్శించారు.

చికిత్సపొందుతూ విద్యార్థి మృతి

లింగాలఘణపురం, సెప్టెంబరు21: మండలంలోని నెల్లుట్లకు చెందిన మోటె భరత్(13) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్సపొందుతూ శనివారం మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈనెల 17న జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిపై సైకిల్‌పై రోడ్డుదాటుతుండగా అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భరత్ తలకు బలమైన గాయాలు కాగా వెంటనే హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. మృతునికి తల్లి రజిత ఉండగా తండ్రి రవి కొద్దికాలం క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు.